వైఎస్ఆర్
# కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక

గురువారం 04 జూన్ 2026




### ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి
## బంగారు భవిష్యత్తు అందించండి

**యర్రగుంట్ల జూన్ 3 ప్రభాతవార్త:**



యర్రగుంట్ల ముద్దనూరు రోడ్డులో గల జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బడి పండుగ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శివ ప్రసాద్, MRO అమరేశ్వరి ప్రధానోపాధ్యాయుడు గురు భాస్కర్ రెడ్డి విద్యార్థులు, తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలు నేర్పుతున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

### పడకేసిన పారిశుద్ధ్య పనులు
## కంపు కొడుతున్న రహదారి

**సిద్ధవటం జూన్ 3 ప్రభాతవార్త**



పారిశుధ్యం పడక వేయడంతో దోమల వ్యాప్తి చెంది విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని ప్రజలు మండిపడ్డారు మండల కేంద్రమైన సిద్ధవటంలోని మఠం వీధిలో మురుగునీరు, పారిశుధ్యం లోపం వల్ల దోమలు వ్యాప్తి చెంది విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని రహదారులు కంపు కొడుతున్న పారిశుధ్యం తొలగింపు చర్యలు చేపట్టలేదని ఆ ప్రాంతవాసులు బుధవారం తెలిపారు. ఈ విషయమై మండల విస్తరణ అధికారి మెహతాబ్ యాస్మిన్ వివరణ కోరగా మఠం వీధిలో ఉన్న పారిశుద్ధాన్ని మరియు మురిగినీరు తొలగింపు చర్యలు చేపట్టేందుకు యుద్ధ ప్రాథమిక దిశగా చర్యలు తీసుకొని పారిశుధ్య కార్మికులు చేత పనులు చేయించి బ్లీచింగ్ పిచికారి చేస్తామన్నారు.

### రాజంపేట ప్రజలకు శక్తి మేర
# సేవలందించేందుకు కృషి చేస్తా

### టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు

**రాజంపేట, జూన్ 3 ప్రభాతవార్త**

పేదలకు ఉపయోగపడే ప్రతి కార్యక్రమాన్ని రాజంపేటలో నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు తాను వ్యక్తిగతంగా కూడా ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటూ రాజంపేట నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు అన్నారు. బుధవారం ఆయన ఇటీవల ఉచిత కంటి వైద్య శిబిరంలో నిపుణుల సూచనల మేరకు కంటి అద్దాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంతరం రాజంపేట ప్రజల సేవలోనే తరిస్తానన్నారు.కంటి వెలుగు కార్యక్రమం తో కంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.జాబ్ మేళాతో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. కంటి అద్దాల పంపిణీతో బాధ్యత తీరిపోలేదన్నారు.రాజంపేట అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. నిరంతరం రాజంపేట ప్రజలతోనే ఉంటానని, కంటి వెలుగు కార్యక్రమంతో కంటి సమస్యలు, జాబ్ మేళాతో నిరుద్యోగ సమస్యలకు తమ వంతు పరిష్కారం చూపామని,భవిష్యత్తులో రాజంపేట ప్రజల సమస్యల పరిష్కారానికి మరింతగా చొరవ చూపి రాజంపేట ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునేలా ముందుకు వెళ్తానన్నారు. భవిష్యత్తులో మరిన్ని వైద్య శిబిరాలతో పాటు పేదలకు ఉపయోగపడే ప్రతి కార్యక్రమాన్ని రాజంపేటలో నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మన్నూరు సొసైటీ అధ్యక్షులు ముల్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు,పోలి నీటి సంఘం చైర్మన్ నాగినేని నాగేశ్వర్ నాయుడు, కౌన్సిలర్ రాజేష్,మండల అధ్యక్షులు, రవికుమార్ నాయుడు, గజ్జల నరసింహారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు బాపనయ్య నాయుడు, మండల క్లస్టర్ ఇంచార్జ్ దగ్గుబాటి వెంకటేశ్వర్లు నాయుడు, కో క్లస్టర్ ఇంచార్జ్ సతీష్ నాయుడు,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, యూనిట్ ఇంచార్జ్ మహమ్మద్ అలీ,వడ్ల అంజిబాబు ఆచారి,రేడియంట్ సంస్థ సభ్యులు మనోజ్ రెడ్డి, విజన్ 2047 సభ్యులు పాల్గొన్నారు.



వృద్ధునికి కంటి అద్దాలు పెడుతున్న జగన్మోహన్ రాజు

## పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించండి

### ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలి
### స్వచ్ఛ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి



**వేంపల్లె: జూన్ 03 ప్రభాతవార్త**

స్థానిక గ్రామ పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించి, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీలో స్పెషల్ ఆఫీసర్, డిడిఓ వెంకట సుబ్బయ్యను టిడిపి నేతలు కలిశారు. టిడిపి కన్వీనర్ రామమునిరెడ్డి, ఏపి మైనార్టీ ఫైనాన్స్ సంస్థ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, నాయకులు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి(దీల్ మాంగే), మొండోడు గౌస్, యాసిన్ లు స్థానిక సమస్యలపై స్పెషల్ ఆఫీసర్ వెంకట సుబ్బయ్యతో చర్చించారు. అనంతరం ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై నిరంతరం శ్రమిస్తోందని, అధికారులు కూడా అందుకు అణుగుణంగా పని చేయాలని కోరారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీరు విషయంపై ప్రత్యేక కార్యచరణతో పని చేయాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ నిషేధానికి తగిన చర్యలు చేపట్టాలని, స్వచ్ఛ గ్రామ పంచాయతీగా వేంపల్లెను తీర్చిదిద్దేందుకు నాయకులు, అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి బిటెక్ రవి కృషి ఎనలేనదని, టిడిపి కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో
## ఇరువురు మృతి, ఒకరికి గాయాలు

### ముగ్గురు స్నేహితుల వాకింగ్ సమయంలో విషాదం



**మైదుకూరు, జూన్ 03, ప్రభాతవార్త:**

మైదుకూరు మండలంలోని జివి సత్రం గ్రామ యువకులు వాకింగ్ చేస్తుండగా జాతీయ రహదారిపై బద్వేల్ నుంచి మైదుకూరుకు వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బలమైన గాయాలు కావడం వల్ల కంబగిరి మదన గోపాల్ (24), వనిపెంట సుమంత్ (23) అక్కడే మృతి చెందగా, విజయ నరసింహ కు బలమైన గాయాలు కావడంతో కడప రిమ్స్ కు 108 సాయంతో తరలించారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం జీవి సత్రం గ్రామానికి చెందిన యువకులు ఉదయాన్నే వ్యాయామంలో భాగంగా నడుస్తూ మైదుకూరు వైపు వెలుతుండగా బద్వేల్ నుంచి మైదుకూరు కు వస్తున్న క్యాంపర్ ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కంబగిరి మదన గోపాల్ (24), వనిపెంట సుమంత్ (23) లకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విజయ నరసింహ కు బలమైన గాయాలు కావడంతో కడప రిమ్స్ కు 108 సాయంతో తరలించారు. మృతి చెందిన వారిలో మదన్ గోపాల్ జీవి సత్రంలో కటింగ్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు.గత ఏడాది చివరిలో వివాహం అయినది. అతని భార్య ప్రస్తుతం మూడు నెలల గర్భవతి. మరొక మృతుడు వనిపెంట సుమంత్ తమిళనాడులోని సబితా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం అభ్యసిస్తున్నాడు. చేతికి అంది వచ్చిన కుమారుడు అకాలంగా మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగి ఉన్నారు. మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మొదటగా గుర్తు తెలియని వాహనంగా భావించి అనంతరం సీసీ కెమెరాల సహాయంతో ఢీకొట్టిన వాహనాన్ని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడం మరొకరికి గాయాలు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జాతీయ రహదారుల మీద నడకకు దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. వాహనాల అతివేగంపై నియంత్రణ విధించాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య




**దువ్వూరు, జూన్ 03, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తుందని అందువల్ల తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ రమణయ్య అన్నారు. బుధవారం మూడిళ్ల పల్లె గ్రామంలో బడి పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అలాగే ఉచిత డ్రస్సులు అందజేస్తారన్నారు. ఈ అవకాశాలను వినియోగించుకొని నాణ్యమైన విద్యను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాజగోపాల్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు రమేష్ బాబు, ఈశ్వరయ్యలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి




**సుండుపల్లె, జూన్ 03, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని కూడలిలో ఎస్సై హుస్సేన్ వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల పత్రాలను పరిశీలించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.అలాగే హెల్మెట్ ధరించడం, అవసరమైన పత్రాలు వెంట తీసుకెళ్లడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెన్నానది కొల్లగొడుతున్న కేటుగాళ్లు

### గుట్టలు గుట్టలుగా ఇసుక డంపింగ్‌లు

**సిద్ధవటం, జూన్ 3 ప్రభాతవార్త**



రైతుల ముసుగులో ఇసుక దోపిడీ చేసి కేటుగాళ్లు సొమ్ము చేసుకుంటున్న అధికారులు చర్యలు చేపట్టక పెన్నా నది కొల్లగొట్టి వేల రూపాయలు ప్రభుత్వ ఖజానా లూటీ చేస్తున్నారు భూగర్భ జలాలు అట్టడుగు అంతరించిపోయి రైతు పొలాలు దెబ్బతినే అవకాశం ఉందని రైతన్నలు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు మండలంలోని పెన్నా పరివాహ ప్రాంతాలలో ఇసుక మాఫియా చెలరేగిపోతున్నారు కొన్ని గ్రామీణ ప్రాంతాలలో ఇసుక డంపింగులు జోరుగా కొనసాగుతున్నాయి, మాచుపల్లి కడప రహదారిలో కొన్ని స్థావరాలలో ఇసుక డంపింగ్లు జోరుగా సాగుతున్నాయి రైతుల పంట పొలాలకు ఇసుక రవాణా చేసుకోవడానికి అధికారులు అనుమతులు ఇస్తే ఇసుక మాఫియా ఇదే అదును చూసుకొని రెచ్చిపోతున్నారు ఈ విషయమై మండల తాసిల్దార్ ఆకుల తిరుమల బాబు వివరణ కోరగా కొంతమంది రైతులు తమ పొలాలకు ఖరీఫ్ సీజన్లో పంటలు సాగు చేసుకోవడానికి పొలాల్లో ఇసుక తోలుకోవడానికి లింగంపల్లి, మాచుపల్లి,టక్కోలి గ్రామానికి చెందిన రైతులకు పంట పొలాలకు మాత్రమే ఇసుక అనుమతులు ఇచ్చామని రైతుల ముసుగులో ఇసుక డంపింగ్లు చేస్తే కఠినమైన చర్యలు తప్పవనిఇసుక డంపింగ్ యార్డులు పై దాడులు నిర్వహిస్తామన్నారు.

### మున్సిపల్ వార్డుల
## పునర్విభజన సర్దుబాటు

### ఎట్టకేలకు ఖరారైన 32 వార్డుల ఓటర్లు



**రాజంపేట, జూన్ 3 ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజంపేట మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజన పూర్తయింది .అధికార, ప్రతిపక్ష నేతల అభ్యంతరాలు, ఫిర్యాదుల తర్వాత అధికారులు సర్దుబాటు చేసి కట్టే విరగకుండా, పాము చావకుండా అన్నచందంగా సర్దుబాటు చేశారు 32 వార్డుల విభజన తర్వాత నివేదికను సిద్ధం చేశారు. నేడు జరిగే పాలకమండలి సమావేశంలో ఆమోదం కోసం అధికారులు రంగం సిద్ధం చేశారు. గతంలో రాజంపేట మున్సిపాలిటీలో 29 వార్డులు ఉండేవి.35245 ఓటర్లు ఉండేవారు. తాజాగా ప్రభుత్వ మార్గదర్శక మార్గదర్శక సూత్రాలు మేరకు 32 వార్డులు అయ్యాయి. నాలుగు వార్డుల విభజనలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి కూడా వివాదాస్పదం కాకుండా పునర్విభజన చేయాలని సూచించారు. ఏకపక్షంగా పునర్విభజన చేశారని మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, వైసిపి మూడో వార్డు కౌన్సిలర్ సని శెట్టి నవీన్ కుమార్ , డొంక సూరి తదితరులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.మూడవ వార్డులో ఇష్టారాజ్యంగా పునరు విభజన చేశారని పేర్కొన్నారు. ఏడవ వార్డులో 899 మంది ఓటర్లు మాత్రమే ఉంచారని, అలాగే 17వ వార్డులో 872 మంది ఓటర్లు, 30 వార్డులో 864 మంది ఓటర్లు, 32 వార్డులో ఏకంగా 1393 ఓటర్లు ఉంచారని ఇది సరికాదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫలితంగా టౌన్ ప్లానింగ్ అధికారి సమస్యలువిని సర్దుబాటు చేసే విధంగా ఇరు వర్గాలతో చర్చించి పునర్విభజన చేశారు. ఈ మేరకు ఇరు వర్గాలు దాదాపు సర్దుబాటుకు సమ్మతించారు. పునర్విభజన వార్డుల నివేదికను పాలకమండలి ఆమోదం కోసం నేడు జరిగే అత్యవసర సమావేశంలో సభ్యుల ముందుకు ఈ నివేదికనుంచనున్నారు.

## హామీలతో ఓట్లు.. అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు

- జగన్‌తో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు నిద్రలేని రాత్రులు
- రాజధాని పేరుతో రాష్ట్ర ఖజానా ఖాళీ చేసిన చంద్రబాబు
- ప్రజల తరుపున వైసీపీ ఆధ్వర్యంలో నిరసనలు
- చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది
- కూటమి ప్రభుత్వం పై వైసీపీ నేతల మండి పాటు

**పులివెందుల, జూన్ 3, ప్రభాతవార్త :**

చంద్ర బాబు నాయుడు హామీలతో ఓట్లు సాధించి అధికారంలోకి వచ్చాక ప్రజలకు వెన్నుపోటు పొడిచారని జగన్ పేరు చెబితే చాలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లకు నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు అని రాజధాని పేరుతో రాష్ట్ర ఖజానా ఖాళీ చేశారు అని చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది అని వైకాపా ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందంటూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో నిరసన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు వైయస్ మనోహర్ రెడ్డి, వైయస్ మదన్ మోహన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కూటమి నాయకులు సూపర్ సిక్స్‌తో పాటు అనేక సంక్షేమ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, అయితే రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా వాటిలో చాలా వరకు అమలు కాలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులకు ప్రతి ఏడాది ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పి అమలు 4వ పేజీలో



వెన్నుపోటు పోస్టర్ల కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ నేతలు

### శ్రీ సంకటహర చతుర్థి
## గణపతి వ్రత మహోత్సవం

**బ్రహ్మంగారిమఠం జూన్ 3 ప్రభాతవార్త**

జగన్నాథ శ్రీ ఈశ్వరీదేవి మఠము, నందు కొలువైన శ్రీ సంకటహర గణపతి స్వామివారి సన్నిధిలో బుధవారం అధిక జ్యేష్ఠ బహుళ చవితి, సంకటహర చతుర్థి శ్రీ సంకటహర చతుర్థి గణపతి వ్రతము శ్రీ ఈశ్వర దేవి మఠం మఠాధిపతులు శ్రీ వీర శివకుమార స్వాముల వారి ఆధ్వర్యంలో విశేషంగా నిర్వహించారు. ఉభయదాతలు చిన్ రెడ్డి సంజీవరెడ్డి ధర్మపత్ని లక్షీ ్మ సౌజన్య దంపతులు, కుటుంబ సభ్యులు, వరదాయపల్లి, భక్త మహాశయులు అధిక సంఖ్యలో విచ్చేసి, వ్రతంలో పాల్గొని, తీర్థ ప్రసాదములు స్వీకరించి నట్లు శ్రీ ఈశ్వరి దేవి మఠం కార్య నిర్వహణ అధికారి బి.వి. జగన్ మోహన్ రెడ్డి తెలిపారు.



## నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ పాఠశాలలో చదివించాలి

**రాజుపాళెం, జూన్ 3, ప్రభాతవార్త:**




మండల పరిధిలోని పర్లపాడు గ్రామంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు హనుమంతరెడ్డి, ఎంఈఓ ప్రసాద్, మోడల్ ప్రైమరీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవిల ఆధ్వర్యంలో బడి పండుగ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొని ప్లకార్డ్స్ తో నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాణ్యమైన ప్రమాణాలతో మంచి విద్య కోసం మంచి ప్రావీణ్యం గల ఉపాధ్యాయుల బోధనతో విద్యార్థుల మంచి భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిద్దామని ర్యాలీగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, సచివాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

2వ పేజీలో

### వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

4వ పేజీలో

# గజ్జపూజ మహోత్సవానికి 20 వేల ఆర్థిక సహాయం

**సిద్ధవటం, జూన్ 3 ప్రభాతవార్త**

మంమాధవరం1 గ్రామంలో శుక్రవారం నిర్వహించనున్న గజ్జపూజ మహోత్సవానికి రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి క్రిష్ణ రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. గ్రామ మహిళలను ఆడబిడ్డలుగా భావించి గజ్జపూజ ఖర్చుల నిమిత్తం తన అనుచరులు అవ్వారు రవిశంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి దేరంగుల శ్రీకాంత్‌ల చేతుల మీదుగా బుధవారం నగదును అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు అతికారి క్రిష్ణకు కృతజ్ఞతలు తెలుపుతూ, మహిళల పట్ల ఆయన చూపుతున్న ఆదరణ అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయ కళలను ప్రోత్సహిస్తూ మహిళలకు అండగా నిలుస్తున్న ఆయన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి దేరంగుల శ్రీకాంత్ మాట్లాడుతూ, మహిళల అభివృద్ధి, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణకు అతికారి క్రిష్ణ ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు. మహిళలు కోలాట భజనల ద్వారా తమ ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకు ఆయన సహకారం కొనసాగుతుందని చెప్పారు. అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ, గ్రామీణ మహిళల్లో దాగి ఉన్న కళా ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంలో కోలాట శిక్షణ కార్యక్రమం ముఖ్యపాత్ర పోషించిందన్నారు. మూడు నెలలుగా కష్టపడి శిక్షణ పొందిన మహిళలు గజ్జపూజ సందర్భంగా అద్భుత ప్రదర్శనలు ఇవ్వబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలను ప్రోత్సహించడం ద్వారా కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధికి కూడా తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. గత మూడు నెలలుగా కోలాటం మాస్టర్ కిరణ్ ఆధ్వర్యంలో దాదాపు 50 మంది మహిళలకు కోలాట భజనలు, సంప్రదాయ నృత్యాల్లో శిక్షణ అందించగా, శిక్షణ ముగింపు సందర్భంగా గజ్జపూజ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా మహిళలు కోలాట భజనలు, సంప్రదాయ నృత్యాల ద్వారా తమ కళా ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో కోలాటం మాస్టర్ కిరణ్, వర్ది వెంకట్రామయ్య, కోలాట బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఐదుగురు జూదరులు అరెస్ట్

**దువ్వూరు, జూన్ 3, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని నీలాపురం చెరువులో జూదం ఆడుతున్న ఐదు మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 7500 రూపాయలు నగదును స్వాదీనం చేసుకున్నట్లు ఎస్ఐ ధనుంజయుడు పేర్కొన్నారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామని, చెరువులో జూదం ఆడుతుండగా వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిని త్వరలో మైదుకూరు కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు.

## నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**యర్రగుంట్ల జూన్ 3, ప్రభాతవార్త:**

యర్రగుంట్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న సమావేశం హాల్లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎర్రగుంట్ల MPDO వెంకట రమణయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు, సభ్యులు తప్పకుండా ప్రగతి నివేదికతో సమావేశానికి సకాలంలో హాజరుకావాలని ఆయన సూచించారు.

# చంద్రబాబు పాలనను ఎండ కట్టాలి : ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి

**రాజంపేట, జూన్ 3 ప్రభాతవార్త**

కుటుంబ ప్రభుత్వాన్ని పరిపాలిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండ కట్టాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తన నివాసంలో 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' పోస్టర్‌ను రాజంపేట శాసన సభ్యులు ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, చొప్ప ఎల్లారెడ్డి ,తదితర ముఖ్య నాయకులు తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, విద్యుత్ ఛార్జీలు, ఇంధన ధరలు పెరగడంతో సామాన్య ప్రజలపై అదనపు భారం పడిందని పేర్కొన్నారు. ధరల పెరుగుదలతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుండగా, ప్రభుత్వం మాత్రం ప్రజా సమస్యలపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, ఎన్నికల సమయంలో చెప్పిన మాటలకు ప్రస్తుతం అమలు చేస్తున్న పాలనకు ఎలాంటి పొంతన లేదని నాయకులు విమర్శించారు. సంక్షేమ పథకాల అమలులో జాప్యం, అభివృద్ధి పనుల్లో మందగమనం, ఉద్యోగ అవకాశాల కల్పనలో నిరక్ష్యం కారణంగా అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



## డీఎస్సీపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు

### జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్



**వేంపల్లె, జూన్ 03 ప్రభాతవార్త**

గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ నియామకాలపై విమర్శలు చేసే అర్హత వైసీపీకి లేదని పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో డీఎస్సీ నిర్వహించకపోవడంతో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. డీఎస్సీ నిర్వహణపై వైసీపీ నేతలు విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీ ని పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించిందని దాసరి రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నారాయణ రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## తలనీలాల వసూలుకు బహిరంగ వేలం

**పెండ్లిమర్రి, జూన్ 3, ప్రభాతవార్త:**

మండలంలోని నందిమండలం గ్రామంలో వెలసిన శ్రీ కొండగంగమ్మ దేవస్థానం నందు ఈ నెల 11వ తేదీ భక్తుల ద్వారా వచ్చే తలనీలాలు వసూలు చేసుకొని అమ్ముకొనే హక్కుకు గాను బహిరంగ వేలం జరపడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. బహిరంగ వేలంలో ఎవరైనా పాట పాడుకునే వారు పాడుకోవాల్సిందిగా కోరారు. తలనీలాలకు డిపాజిట్ రూ.50 వేలు చెల్లించి పాటలో పాల్గొనాలని ఈ పాట హిందువులకు మాత్రమే అని తెలిపారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### 17 మంది లబ్ధిదారులకు రూ.14.59 లక్షల ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్సీ

**పులివెందుల, జూన్ 3, ప్రభాతవార్త :**

ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) గొప్ప అండగా నిలుస్తోందని భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పేర్కొ న్నారు. మంగళవారం తన నియోజకవర్గ పరిధిలోని 17 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 14,59,279 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి నివాసాల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను పేదలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలవడం వల్ల అనేక కుటుంబాలు ఆర్థిక భారాన్ని అధిగమించగలుగుతున్నాయని పేర్కొన్నారు. తమ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయానికి, చెక్కులను స్వయంగా అందజేసిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారునికి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ

## దారి సమస్యను పరిష్కారం చేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ నాయకులు వినతి

### స్పందించిన తాసిల్దార్



దారి సమస్యను పరిష్కరించిన తహసిల్దార్

**పీలేరు జూన్ 3 ప్రభాతవార్త:**

రొంపిచర్ల మండలం బండకిందపల్లి రెవెన్యూ గ్రామము నందు బండకిందపల్లి దళిత గ్రామానికి చెందిన రైతులకు వారి సొంత వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి గత కొన్ని సంవత్సరాలుగా దారిలేక రెవెన్యూ అధికారులను దారి సమస్య తీర్చమని కోరగా అప్పటి రెవెన్యూ అధికారులవారు దారి సమస్య తీర్చలేక పోయారు. సదరు దళిత రైతులు మాల జేఏసీ నాయకుల వారికి తెలియచేసి న్యాయము విజయవలెనని కోరినారు. ఈ విషయమై స్థానిక రొంపిచెర్ల మండల తహసీల్దారు కిరణ్ కుమార్‌ను సంప్రదించి రైతులకు దారి విషయమై మాట్లాడి దారి ఏర్పాటుకు సహకరించమని కోరగా.. తహసీల్దారు స్పందించి దారి ఏర్పాటుకు సహకరించి, దారి ఇవ్వవలసిన కొందరి రైతులతో మాట్లాడి, దారి ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు ఇచ్చారు. బుధవారం ఉదయం రిదితీతో దారి ఏర్పాటు చేసుకోవడానికి అఖిల భారత మల సంఘాల రితిది కమిటీ రాయలసీమ అధ్యక్షులు గుర్రం నారాయణ, పీలేరు మండల సీనియర్ నాయకులు రామచంద్ర, రెడ్డప్ప, తిరుపతి జిల్లా అధ్యక్షులు, చంద్ర గిరి ఏఎంసి డైరెక్టర్ ఏగుంతాటి మురళి, యర్రయ్య, దళిత రైతులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి గారూ ! మీ రెండేళ్ల పాలనలో

## ఏమున్నది గర్వ కారణం ? వైఫల్యాలు తప్ప

**వేంపల్లె: జూన్ 03 ప్రభాతవార్త**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ప్రచార భేరి మోగించాలని ముఖ్యమంత్రి ప్రకటించడం హాస్యాస్పదమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విమర్శించారు. బుధవారం వేంపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూన్ 12తో కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తవుతున్నాయని, ఈ కాలంలో జరిగిన పరిపాలనను పరిశీలిస్తే వైఫల్యాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర అప్పులు పెరగడం, పెట్రోల్-డీజిల్ ధరలు అధికంగా ఉండడం, సంక్షేమ పథకాల అమలులో లోపాలు, రైతులు, ఉద్యోగులు, మహిళలు అసంతృప్తితో ఉండడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. ఆరోగ్యశ్రీ, విద్యా దీవెన పథకాల అమలు సరిగా లేదని, నిరుద్యోగ భృతి, మహిళా సంక్షేమ పథకాలు అమలు కాలేదని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి కూడా బలహీనపడిందన్నారు. ప్రత్యేకహోదా, రాయలసీమ-ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, కడప ఉక్కు కర్మాగారం, దుగ్గరాజపట్నం ఓడరేవు, పోలవరం ప్రాజెక్టు వంటి అంశాల్లో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన ప్రజలకు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని పేర్కొంటూ, ఆత్మస్తుతి, పరనిందలను పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని తులసి రెడ్డి సూచించారు.

## వెన్నుపోటుకు రెండు ఏళ్లు పోస్టర్ విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే

**మైదుకూరు, జూన్ 03, ప్రభాతవార్త:**

మైదుకూరు పట్టణ వైఎస్ఆర్సిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రఘురామి రెడ్డి వెన్నుపోటుకు రెండు ఏళ్లు పోస్టర్ కార్యకర్తలతో విడుదల చేశారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చంద్రబాబు చేసిన వెన్నుపోటు ప్రజలకు తెలియజేసేలా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నిరసన ప్రదర్శన చేపట్టడానికి నిర్ణయం తీసుకున్నామని తెలియజేశారు. తెలుగుదేశం ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఇప్పటికీ మూడు బడ్జెట్లు అయిపోయాయని ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ మేరకు నెరవేర్చలేదని తెలియజేసే దానికి ప్రతి మండలంలో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు అలాగే చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని అంతేకాకుండా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వారికి ఏమాత్రం పథకాలు చేశారో ప్రజలకు తెలియజేయాలని నిలదీశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న వాటిని కూడా తొలగించారని కుటుంబంలో తల్లికి వందనం ఎంతమంది ఉంటే ఎంత మంది పిల్లలకు వర్తిస్తుందని చెప్పి ఎంతమందికి ఇచ్చారో ప్రజలకు తెలియజేయాలని అన్నారు. దీపం పథకం ఎక్కడ అమలు చేశారో చెప్పాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సైకిల్ పై ప్రజల్లోకి వెళ్లి తెలుగుదేశం నాయకులు ఇంటింటికి తిరిగి పథకాలు గురించి వివరించాలని ఆదేశించారు. ప్రజలకి మేము కూడా వస్తాము వాళ్ళని కూడా రమ్మను ఏ కుటుంబానికి ఎన్ని పథకాలు వచ్చాయో అడుగుదామన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ, ఎక్కడ అమలు చేశారని ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్నదాతలు సుఖంగా లేరని రైతులకు సక్రమంగా ఎరువులు ఇవ్వడం లేదని సబ్సిడీలు అందలేదని సరైన గిట్టుబాటు ధర లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మహిళలకు ఫ్రీ బస్సులు అన్నారు అన్నిటికి ఇవ్వడం లేదు విద్యార్థులకు ఫీజు రివర్స్మెంట్, ఆరోగ్యశ్రీ, ఇలాంటి విన్న పథకాల నీరుగారిస్తున్నారని గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి చేయూత, అసరా, పొదుపు సంఘాలకు, అమ్మఒడి, వసిది దీవెన, విదేశీ విద్యా దీవెన, సున్నా వడ్డీ, బీమా సబ్సిడీలు, పింఛన్లు, కాపు నేస్తం, జగనన్న చేయూత, వాహన మిత్ర, అగ్రిగోల్డ్ బాధితులకు భరోసా కల్పించామని ఎన్నో పథకాలు అమలు చేసి ప్రతి ఇంటికి తెలియజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఎఫ్ సుబ్బయ్య, చాపల షరీఫ్, కిరణ్ మై, మండల నాయకులు, పట్టణ కార్యకర్తలు, వైయస్సార్ సిపి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో యువతికి ప్రసవం

### ఐసీడీఎస్ అధికారులకు పర్యవేక్షణలో శిశువు

**మదనపల్లెక్రైం, జూన్ 3 ప్రభాతవార్త.**



ఒంగోలు ప్రాంతానికి చెందిన ఒక యువతి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసు పత్రిలో బుధవారం ఒక ఆడపిల్లకు జన్మని చ్చింది. కుటుంబ సభ్యుల నిరాకరణతో శిశువును ఐసీడీఎస్ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బాధితులు, స్థాని కుల కథనం ప్రకారం... ఒంగోలుకు చెందిన బ్రహ్మయ్య, వెంకటలక్ష్మి దంపతులు ప్రస్తుతం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మండలంలో భవన నిర్మాణ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె కల్పన (19) ఒక వ్యక్తితో సన్నిహితంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే, కల్పన గర్భవతి అయిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పకపోవడంతో వారు ఆమెను గుర్తించలేకపోయారు. కేవలం అనారోగ్య సమస్యల వల్లే కడుపునొప్పి, ఇతర ఇబ్బందులు వస్తున్నాయని భావించి, వారు గతంలో ఆమెకు సాధారణ చికిత్సలు కూడా చేయించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం కల్పనకు ప్రసవ వేదన తీవ్రం కావడంతో, సాధారణ అనారోగ్యంగా భావించి కుటుంబ సభ్యులు ఆమెను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కాన్పు చేయగా ఆడపిల్లకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, బిడ్డలకు ఆసుపత్రిలోనే వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

**ఐసీడీఎస్ ఆధీనంలో శిశువు.. అధికారుల విచారణ**

యువతికి వివాహం కానీ కారణంగా పుట్టిన బిడ్డ తమకు వద్దని కల్పన కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బందికి తెలిపినట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్, సిడబ్ల్యూసి అధికారులు తక్షణమే స్పందించి ఆసుపత్రికి చేరుకుని, శిశువును తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇది ఇలా ఉండగా ఘటనపై ఐసీడీఎస్, సిడబ్ల్యూసి అధికారులు, పోలీసులు విచారణ జరుపుతున్నారు. కుటుంబ సభ్యుల నుంచి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

### తెదేపా నేత ఆధ్వర్యంలో

## ఎస్సీ కాలనీకి తాగునీటి సరఫరా



**వేంపల్లె జూన్ 03 ప్రభాతవార్త**

వేంపల్లె మండలంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు తెదేపా నేత దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి తక్షణ సహాయం అందించారు. గత మూడు రోజులుగా కాలనీలో తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానికులు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, పులివెందుల నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జ్ బీటెక్ రవి సూచనల మేరకు ఆయన స్పందించారు. తన సొంత ఖర్చులతో 16 ట్యాంకర్ల ద్వారా కాలనీ వాసులకు తాగునీటిని సరఫరా చేశారు. మండు వేసవిలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంపై కాలనీ ప్రజలు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు స్పందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. గంగాధర్, అశోక్, మధు, కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిలో శ్రామికుల సంఖ్యను పెంచాలి

**దువ్వూరు, జూన్ 3, ప్రభాతవార్త:**

మండల పరిధిలో 23 గ్రామ పంచాయతీలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకంలో శ్రామికుల సంఖ్యను పెంచాలని ఏపీఓ లక్ష్మీ నారాయణ పే ర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కం టే ఈ ఏడాది శ్రామికుల సంఖ్య తక్కువగా ఉందని శ్రామికుల సంఖ్యను పెం చాలన్నారు. శ్రామికుల సంఖ్య పెరిగితే తెలుస్తుంది అధిక మొత్తంలో డబ్బులు చెల్లిస్తారని, దాంతో పాటు అభివృద్ధి పనులకు కూడా నిధులు వస్తాయన్నారు. అలాగే 2026, 27వ సంవత్సరానికి గాను ఉద్యానవన పంటలు సాగు చేసు కునే రైతులకు వివిధ ప్రోత్సాహకాలు ఉన్నాయని అందువల్ల రైతులను కలిసి ఉద్యానవన పంటలు సాగు చేసుకునే విధంగా చూడాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఉపాధి




## ఆధార్ కార్డుకు తాళం వేసుకోండి ఇలా

### సైబర్ నేరాల నుంచి రక్షణ

**పీలేరు జూన్ 3 ప్రభాతవార్త:**

ఆధార్ సంఖ్యను గోప్యంగా ఉంచాలని ప్రభుత్వాలు సూచిస్తున్నాయి అందుకు తగ్గట్టుగానే ఆధార్ గోప్యతకు అన్ని చర్యలు తీసుకుంటుంది అయినా కూడా సైబర్ నేరగాళ్లు మన ఆధార్ గోప్యత పై పంజా విసురుతున్నారు .దీంతో మన వివరాలన్నీ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళుతూ వేధింపులు అనేక ఆర్థిక నేరాలకు కేంద్రంగా మారుతుంది. ఈ సమస్యకు పరిష్కార మార్గంగా మీ ఆధార కార్డు నెంబర్ కు లాక్ వేసుకునే అవకాశం కల్పించింది దీంతో సైబర్ నేరాల నియంత్రణకు అడ్డుకట్టు వేసేందుకు అవకాశం మన చేతు ల్లోనే ఉంది. ఆధార్ నెంబర్ బ్లాక్ చేసుకోవడంతో ఎంతో ఉపయోగపడుతుంది. దీనివల్ల మీ వివరాలను నేరగాళ్లు దుర్వినియోగం చేయలేరు.

**ఆధార్ లాక్ చేయండిలా**

గూగుల్లో మై ఆధార్ యాప్ ను ఓపెన్ చేయాలి. హోమ్ పేజీలో కనిపించే ఆధార్ లాక్, అన్లాక్ ఆప్షన్ ఎంచుకుని లాక్ యూఐడీ రేడియో బటన్ ఎంపిక చేయాలి. మీ ఆధార్ 12 అంకెలు, పూర్తి పేరు, పిన్ కోడ్, సెక్యూరిటీ కోడ్ నమోదు చేయాలి. సెండ్ ఓటీపీపై క్లిక్ చేయాలి. మీ రిజిస్టర్ సెల్ ఫోన్ కు ఓటీపీని

**ఎంటర్ నమోదు చేసి సబ్మిట్ చేస్తే ఆధార్ లాక్ అవుతుంది .**

ఆధార్ నెంబర్ లాక్ చేయడం వల్ల వ్యక్తి వ్యక్తిగత గోప్యత సమాచారం ఓపెన్ కాదు. బయోమెట్రిక్ వివరాలు సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా సురక్షితంగా ఉంటాయి. ఆధార్ జిరాక్సు లేదా నంబరు ఇతరుల చేతికి చిక్కినా వారు ఏం చేయలేరు. వేలిముద్రలు, ఐరిస్ తో లాక్ చేయడం వల్ల మీ అనుమతి లేకుండా ఎవరూ ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా సురక్షితంగా ఉంటుంది. ఇలాంటి ఆర్థిక లావాదేవీలు జరిగే అవకాశం ఉండదు చేసుకోవడానికి వీలు ఉండదు అనుసందానంగా పాన్ కార్డు, ఓటరు ఐడీ, బ్యాంకు ఖాతాలకు పూర్తి రక్షణ లభిస్తుంది. వ్యక్తి గత సమాచారం ఎవరికీ బహిర్గతం కాదు.

## అక్రమంగా మద్యం సేవించే షాపుల లైసెన్స్‌లు రద్దు చేయాలి

### ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి ముభారక్

**మదనపల్లె, జూన్ 3 ప్రభాతవార్త :**

మద్యం దుకాణాల్లో పక్కన అక్రమంగా మద్యం సేవించేందుకు అనుమతి ఇస్తున్న షాపుల లైసెన్స్‌లు రద్దు చేయాలని ఏఐటియుసి నియోజకవర్గ ప్రధాన కార్య దర్శి షేక్ ముభాకర్ డిమాం డ్ చేశారు. బుధవారం జిల్లా ఎక్సైజ్ డిపార్ట్‌మెంటుతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మద్యం దుకాణాల్లో మద్యం కొనుగోలుచేసిన వ్యక్తులు అదే ప్రాంగణంలో మద్యం సేవిస్తుండడం వల్ల తరచూ గొడవలు, శాంతి భద్రతల సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ఇటీవల పలు మద్యం దుకాణాల్లో గొడవలు జరగడం వల్ల పలువురు గాయాలకు గురి కావడంజరిగిందన్నారు. అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా సంబంధిత ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న మద్యం దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేయాలన్నారు. అన్ని మద్యం దుకాణాల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ మద్యం సేవించే విధానాన్ని అరికట్టాలన్నారు. మద్యం దుకాణాల్లో 24గంటలు మద్యం విక్రయిస్తుండడం వల్ల పలువురు ఆనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. అధికారులు చొరవ తీసుకొని నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# భవన నిర్మాణానికి రూ.20 వేల విరాళం ఇచ్చిన ముద్దిగారి బాబురెడ్డి

**పులివెందుల, జూన్ 3, ప్రభాతవార్త :**

పులివెందుల పట్టణంలోని జగనన్న కాలనీ వెళ్లే 100 అడుగుల రహదారి మార్గంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న నూతన భవన సముదాయానికి వైఎస్సార్‌సీపీ లింగాల మండల కన్వీనర్ ముద్దిగారి బాబురెడ్డి రూ.20 వేల విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని వైఎస్సార్‌సీపీ పులివెందుల పట్టణ కన్వీనర్ గంగాధర్ రెడ్డి చేతుల మీదుగా సేవా సమితి అధ్యక్షుడు రాజుకు అందించారు. ఈ సందర్భంగా ముద్దిగారి బాబురెడ్డి మాట్లాడుతూ, సమాజ సేవను లక్ష్యంగా పెట్టుకుని స్నేహిత అమృత హస్తం సేవాసమితి విద్య, వైద్య రంగాల్లో ఉచిత కోచింగ్‌లు, నేత్రదానం ప్రోత్సాహ కార్యక్రమాలు, అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సేవాసమితి నిర్మిస్తున్న నూతన భవన సముదాయం పూర్తయితే మరింత విస్తృత స్థాయిలో సేవలను అందించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. సమాజంలో సేవా దృక్పథం కలిగిన ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించి భవన నిర్మాణానికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ భవనం సేవా కార్యక్రమాలకు శాశ్వత కేంద్రంగా నిలవడంతో పాటు భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడే విధంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. సేవాసమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ, భవన నిర్మాణానికి సహకరిస్తున్న దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమాజ హితం కోసం నిర్మిస్తున్న ఈ భవనానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, అందరి మద్దతు, ఆశీస్సులతో నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న సేవా సమితి సభ్యులు ముద్దిగారి బాబురెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసి అభినందనలు తెలిపారు.



## ఆటో బోల్తా ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి

**మదనపల్లెక్రైం, జూన్ 3 ప్రభాతవార్త.**

నిమ్మనపల్లె మండలం మర్రి బండ వద్ద గత నెల 29వ తేదీ ఆటో బోల్తా పడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమణ బుధవారం మృతి చెందాడు. నిమ్మనపల్లె ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు.. నిమ్మనపల్లె మదనపల్లె మార్గంలోని చల్లావాండ్లపల్లె సమీపంలో గల మర్రి బండ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ వెంకటేష్ సహా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ఆటో డ్రైవర్ వెంకటేష్, నిమ్మనపల్లె 108 ఉద్యోగి వాణి, మహబూబ్‌బాషా, దేవలంకురపల్లికి చెందిన రమణ, మరో వ్యక్తి ఉన్నారు.

# చట్టాలపై మహిళలకు అవగాహన మీ హక్కు

**సిద్దవటం జూన్ 3 ప్రభాతవార్త.**
సిద్దవటం ఎంపీడీఓ కార్యాలయం సభా భవనంలో బుధవారం కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మహిళల భద్రత, పిల్లల సంరక్షణపై మహిళలకు అవగాహన కార్యక్రమం ఎంపీడీఓ ఫణి రాజకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై హారిక మాట్లాడుతూ లైంగిక నేరాల నుంచి పిల్లల సంరక్షణ చట్టం 2012 (ఫోక్సో యాక్ట్) పై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలు, పిల్లలపై పర్యవేక్షణ, చైన్ స్నాచింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. మీ భద్రత మీ హక్కు అని 1098, 1930 టోల్ ఫ్రీ నెంబర్ లపై అవగాహన కల్పించారు. పిల్లలు ఫోన్ లకు ఆకర్షితులై చెడిపోతున్నారని పిల్లల పట్ల తల్లిదండ్రులు పర్యవేక్షణ అవసరమన్నారు. ఎవరైనా మీ మొబైల్ కి ఫోన్ చేసి, బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నాము మీ అకౌంట్ నెంబర్, ఆధార్ అడిగినప్పుడు జాగ్రత్త వహించి సైబర్ నేరగాళ్ల చేతిలో మోస పోవద్దని బస్టాండు, రైల్వే స్టేషన్లు వివిధ జనసంద్రోహం ఉన్న ప్రదేశాలలో కొంతమంది 500 /రూ నోటు కింద పడి వేసి డబ్బు మీదేనా అడిగినప్పుడు ఆ నోటు ఎవరు పట్టుకోవద్దని మిమ్మల్ని మోసం చేసి మీ దగ్గర ఉన్న డబ్బులు లాగేసుకుంటారని తెలిపారు చైన్ స్నాచర్ అనే మోస గాళ్లు మహిళ మెడలో ఉన్న విలువైన బంగారు ఆభరణాలు దొంగలించి తీసుకెళ్తారని, వారిపట్ల మహిళలు జాగ్రత్త వహించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణి రాజకుమారి, ఎంఈఓ లు, నాగరత్న, ఆవుల అరుణ, ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, డ్వాక్రా మహిళలు స్థానిక పోలీసులు పాల్గొన్నారు.




# ఏజీపీ రామకృష్ణారెడ్డికి ఘన సన్మానం

**వేంపల్లె, జూన్ 03 ప్రభాతవార్త**
అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమితులైన అడ్వకేట్ రామకృష్ణారెడ్డిని బుధవారం వేంపల్లెలో దేశం వెంకటసుబ్బారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దేశం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ రామకృష్ణారెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజలకు మరింత సేవలందించి మంచి పేరు ప్రతిష్టలు సంపాదించాలని ఆకాంక్షించారు. తన సేవలతో ఏజీపీ పదవికి వన్నె తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గండి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటరమణ, ఏమిరెడ్డి కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, నాగరాజు, ప్రభాకర్ నాయుడు, ఐచర్ రమణ, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఏపీ పీజీ సెట్‌లో మెరిసిన వేంపల్లె

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆణిముత్యాలు



**వేంపల్లె: జూన్ 03 ప్రభాతవార్త**
స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏపీ పీజీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచి కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఉషశ్రీ తెలిపిన వివరాల ప్రకారం కంప్యూటర్ సైన్స్ విభాగంలో విద్యార్థిని జి. గౌతమి రాష్ట్రవ్యాప్తంగా ప్రథమ ర్యాంక్ సాధించింది. అలాగే రసాయన శాస్త్ర విభాగంలో పి. లక్ష్మీదేవి 36వ ర్యాంక్, కే. నవ్యశ్రీ 67వ ర్యాంక్ సాధించి కళాశాల ప్రతిష్ఠను పెంచారు. అదే విధంగా 100 నుంచి 1200లోపు ర్యాంకులను మరో 12 మంది విద్యార్థులు సాధించడం విశేషం. ఇక ఏపీ ఈడీసెట్‌లో వి. కులవర్ధన్ 1681వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.

# చిరు వ్యాపారులకు ఆర్థిక బలం అందిస్తున్న పీఎం స్వనిధి: సుప్రజ

**బద్వేల్ అర్బన్, జూన్ 3 (ప్రభాతవార్త):**



వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఆర్థికంగా అండగా నిలుస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం పీఎం స్వనిధి అని బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న ఈ పథకం ద్వారా చిన్న వ్యాపారులు బ్యాంకు గ్యారంటీ లేకుండానే సులభంగా రుణాలు పొందుతున్నారని తెలిపారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రాయితీ కూడా లభిస్తోందని చెప్పారు. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు క్యాష్‌బ్యాక్‌లు, ఇతర ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయని, దీంతో చిన్న వ్యాపారులు ఆధునిక విధానాలకు అలవాటు పడుతున్నారని పేర్కొన్నారు. స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తూ పీఎం స్వనిధి పథకం దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తోందన్నారు. చిన్న వ్యాపారుల కలలకు రెక్కలు తొడిగిన అద్భుతమైన పథకంగా పీఎం స్వనిధి నిలిచిందని ఆమె అన్నారు. "సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్" నినాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, దేశాభివృద్ధి కోసం కృషి చేస్తోందని సుప్రజ పేర్కొన్నారు.

# విద్యుత్ సేవల మెరుగుదలకు కృషి చేస్తా

## పులివెందుల డివిజన్ నూతన డీఈగా నాగేంద్ర బాధ్యతల స్వీకారం

**పులివెందుల, జూన్ 3, ప్రభాతవార్త :**
పులివెందుల విద్యుత్ డివిజన్ నూతన డివిజనల్ ఇంజనీర్ (డీఈ)గా నాగేంద్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పదవీ బాధ్యతలను స్వీకరించారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటి వరకు పులివెందుల డీఈగా పనిచేసిన ప్రసాద్ రెడ్డి తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ కావడంతో ఆ స్థానంలో వేంపల్లిలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ)గా విధులు నిర్వహిస్తున్న నాగేంద్ర ఇటీవల పదోన్నతి పొంది డీఈగా నియమితుల య్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగేంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగు లు, కార్మికులతో సమన్వ యంగా పనిచేస్తూ వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి చర్యలు చేపడతానన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ యూనియన్ నాయకులు నాగేంద్రను కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


నూతన డిఈకి అభినందనలు తెలుపుతున్న యూనియన్ నాయకులు

# సిద్దవటం-అట్లూరు ఫారెస్ట్

## చెక్‌పోస్టులను ఎత్తివేయాలి




**బద్వేలు, జూన్ 3, ప్రభాతవార్త**
బద్వేల్ నియోజకవర్గ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన సిద్దవటం, అట్లూరు ఫారెస్ట్ చెక్‌పోస్టులను తక్షణమే ఎత్తివేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బద్వేలు పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలివికోడి సంరక్షణ పేరుతో ఏర్పాటు చేసిన ఫారెస్ట్ చెక్‌పోస్టుల కారణంగా రాత్రి 9 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు రాకపోకలు నిలిపివేస్తున్నారని, దీంతో అత్యవసర వైద్య అవసరాల కోసం కడప, తిరుపతి, చెన్నై వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రజలు వంద కిలోమీటర్లకు పైగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా కొందరు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. బద్వేల్ నియోజకవర్గానికి వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహించినప్పటికీ చెక్‌పోస్టుల సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని చంద్రశేఖర్ విమర్శించారు. అలాగే కలివికోడి సంరక్షణ పేరుతో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, ఏరియా కమిటీ సభ్యులు విజయరావు, నారాయణ, బి.కోడూరు మండల కార్యదర్శి మార్క్, ఇతరులు పాల్గొన్నారు.

# వంట ఏజెన్సీ , సహాయకులకు శిక్షణ, వంట పోటీలు






**ఒంటిమిట్ట జూన్.03. ప్రభాతవార్త**
ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగంగా విద్యార్థుల సంక్షేమార్థం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీలకు మరియు సహాయకులకు మండల కేంద్రమైన ఒంటిమిట్ట జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు రుచికరంగా వంట చేయడంలో శిక్షణ ఇస్తూ వంట పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి వీర శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వంట సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించు నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెనూ ప్రకారం రుచికరంగా వంటచేసి పిల్లలకు అందించాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదన్నారు. పిల్లలకు అందించే వంటల విషయంలో పొరపాట్లు జరిగితే సహించేది లేదన్నారు. శాఖపరంగా తగు చర్యలు ఉంటాయన్నారు. కావున జాగ్రత్తగా వంటలు చేసి పిల్లలకు వడ్డించాలన్నారు. ప్రభుత్వము అత్యంత చొరవతో బడి ఈడు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తుందన్నారు. పాఠశాలలో విద్యార్థులు పౌష్టికాహారం భుజించి ఆరోగ్యంగా ఉన్నప్పుడే అవలీలగా విద్య అభ్యసించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కొంతమంది వంట సిబ్బంది గత 25 సంవత్సరాల నుంచి పాఠశాలలో వంట విధులను నిర్వహిస్తున్నామని ఉన్నపలంగా తమను విధుల నుంచి తీసివేస్తే ఏం చేయాలంటూ? అధికారిని ప్రశ్నించారు. వంట సిబ్బంది అడిగిన ప్రశ్నలకు మండల విద్యాధికారి స్పందించి తమ సమస్యలను జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తప్పకుండా న్యాయం చేస్తామన్నారు. అనంతరం వంట సిబ్బందికి వంట పోటీలను నిర్వహించారు. కొండ మాచుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, సిబ్బంది పాల్గొని ప్రథమ స్థానము, మండపం పల్లె పాఠశాల సిబ్బంది పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానము, కొత్త మాధవరం పాఠశాల సిబ్బంది పోటీల్లో పాల్గొని తృతీయ స్థానము, చింతరాచపల్లి పాఠశాల వంట సిబ్బంది పోటీల్లో పాల్గొని చతుర్థ స్థానాన్ని సంపాదించుకున్నారు. బహుమతులు తీసుకున్నారు. ఈ పోటీలను ఎంఈఓ దగ్గరుండి నిర్వహించి వంట సిబ్బంది చేసిన వంటలను రుచి చూసి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, వంట సిబ్బంది, సహాయకులు, యూనియన్ సెక్రటరీ చాంద్బాషా తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ బీఈడీ కళాశాలల్లో అక్రమాలు



**ఎడ్యుకేషన్ జూన్ 3 ప్రభాతవార్త :**
యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని పలువురు బీఈడీ కళాశాలల్లో భవనాలు, అధ్యాపకులు, విద్యార్థులు లేకపోయినా అన్ని సౌకర్యాలు ఉన్నట్లు తనిఖీ నివేదికలు ఇస్తున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న ఆరోపించారు. బుధవారం పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఈడీ కళాశాలల తనిఖీలు తూతూ మంత్రంగా జరుగుతున్నాయని విమర్శించారు. విశ్వవిద్యాలయం గుర్తింపు ఇచ్చిన చిరునామాల్లో కనీసం కళాశాల బోర్డులు కూడా కనిపించడం లేదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై వీసీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ స్పందించి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా నాయకులు జగదీశ్ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



**వేంపల్లె జూన్ 03 ప్రభాతవార్త**
పులివెందుల డివిజన్ అభివృద్ధి అధికారి వెంకట సుబ్బయ్యను ప్రభుత్వం వేంపల్లె గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ గా నియమించింది. ఈ నేపథ్యంలో బుధవారం వేంపల్లె పంచాయతీ కార్యాలయానికి విచ్చేసిన వెంకట సుబ్బయ్యను వేంపల్లెకు చెందిన ఏపి మైనార్టీ ఫైనాన్స్ సంస్థ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నాయకులు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి (దిల్ మాంగే), యాసిన్, గంగాధర్ రెడ్డి, తాళ్లపల్లి అల్లాఫ్ లు కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలతో పాటు ప్రజలకు సేవలందించడంలో ఎలాంటి అలసత్వం వహించకూడదని వారు కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. అలాగే స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో తనకు అప్పగించిన బాధ్యతలను పంచాయతీ అభివృద్ధికి చర్యలు చేపడుతామని వెల్లడించారు.

# హామీలతో ఓట్లు..

## అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు



మీడియాతో మాట్లాడుతున్న వైకాపా నేత ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి

చేయలేదని, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కూడా పూర్తిస్థాయిలో జరగలేదని పేర్కొన్నారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించి ఇచ్చిన పలు హామీలు కూడా నెరవేర్చలేదన్నారు. పెన్షన్ల విషయంలోనూ ఎన్నికల హామీలకు అనుగుణంగా చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రజా సమస్యలపై వైసీపీ ఆధ్వర్యంలో పోరాట కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్న ఆయన, హామీల అమలులో విఫలమైతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనజీవామృతం తయారీ పై రైతులకు శిక్షణ తరగతులు

**సుండుపల్లె, జూన్ 03,ప్రభాతవార్త :**
పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగినది బుధవారం తిమ్మసముద్ర గ్రామం వడ్లపల్లి నందు ఉన్న బొమ్మిశెట్టి సుబ్బమ్మ ఇంటిదగ్గర దాదాపుగా వంద కేజీల దేశవాళి ఆవు పేడను మరియు రెండు కేజీల శనగపిండి రెండు కేజీల నల్ల బెల్లంతో తయారీ విధానం పై డెమో చేసి చూపించడం జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో రసాయన ఎరువులకు బదులు ఘనజీవామృతం ద్రవ జీవామృతం వాడడం వలన భూమి నిద్రావస్తు నుండి మేలుకొల్పడానికి ఈ ఘనజీవామృతం ఎంతో ఉపయోగపడుతుందని తక్కువ ఖర్చుతో రైతుల విధానాన్ని పాటించడం వల్ల భూమిలో పోషకాలు అభివృద్ధి చెంది భూమి గుల్లబారుతుందని అక్కడికి వచ్చినటువంటి రైతులకు తెలపడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వము రాయలసీమ జిల్లాలలో ముఖ్యంగా కడప జిల్లాలో ఎల్ ని నో ప్రభావం ఎక్కువగా ఉంటుందని దీనివలన రైతులు బెటకు తట్టుకునే పంటలు వేసి విత్తనాలు గుళికలు తయారుచేసి వేసుకోవడం వల్ల రైతులకు ఎంతో ఉపయోగమని తెలపడం జరిగినది శివజ్యోతి ప్రకృతి వ్యవసాయవనరుల కేంద్రం ద్వారా ఏ డి తమ సొంత పొలం పిఎమ్‌డిఎస్ వేయుటకు రెండు కిట్లు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎఫ్ఎమ్టీలు రామమోహన, ఎస్ వెంకటయ్య, పి.ఆంజనేయులు, డిఎంఎంటి వీర నాగయ్య, బి ఆంజనేయులు, రెడ్డి పార్వతి, దీప, షబానా, సుమలత మాజురుణ్, లక్ష్మి, గురులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# సబ్సిడీపై జీలుగలు పంపిణీ

**దువ్వూరు, జూన్ 3, ప్రభాతవార్త:**
మండల పరిధిలో వరి సాగు చేసే రైతులకు ఈనెల 5వ తేదీ నుంచి సబ్సిడీపై జీలగలు, జనుములు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు అనుసంధానం గల సెల్ ఫోన్ నెంబర్ ను, పాస్ పుస్తకాన్ని తీసుకొని రైతు సేవా కేంద్రములో నమోదు చేసుకోవాలన్నారు. క్వింటాలు జీలుగలు ధర 16 వేల రూపాయలు అని సబ్సిడీ పోను 8వేలు రూపాయలు చెల్లించవలసి ఉంటుందన్నారు. ఒక ఎకరా గల రైతుకు 10 కేజీలు ఇస్తారని అందుకు గాను సబ్సిడీ పోను 800 చెల్లించాలన్నారు. 2 ఎకరాలకు 20 కేజీలు, మూడు ఎకరాలకు 30 కేజీలు, 4 ఎకరాలకు 40 కేజీలు గరిష్టంగా 50 కేజీల వరకు అందజేస్తామన్నారు. మండల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

**బద్వేలు అర్బన్, జూన్ 3, ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ, నియోజకవర్గ యువ నాయకుడు మరియు రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బద్వేలు నియోజకవర్గంలోని పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. టీడీపీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రజలకు వాస్తవాలను వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, ప్రచార సామగ్రిని పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. జూన్ 4న మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు, జూన్ 8 లేదా 9 తేదీల్లో ఇండోర్ సమావేశాలు, జూన్ 12న భారీ ర్యాలీలను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## మండల కేంద్రానికి

# 28 వేల పాఠ్యపుస్తకాలు చేరిక

**మైదుకూరు,జూన్ 03,ప్రభాతవార్త:**
మైదుకూరు మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలకుసంబంధించిన పాఠ్యపుస్తకాలు ఇప్పటికే 28 వేల పుస్తకాలు మండల కేంద్రానికి చేరాయిని ఎంఈఓ నరహరి శర్మ తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యాసంస్థరానికి సంబంధించిన తరగతి పుస్తకాలలో స్వల్ప మార్పులు జరిగాయని తెలియజేశారు. ఈ సంవత్సరం 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు పాఠ్యపుస్తక లలో స్వల్ప మార్పులతో ముద్రణ జరిగింది. ఈ విద్య సంవత్సరం కొత్తగా 5వ తరగతిలో హిందీ వర్ణాలు జత చేశారు. మండల కేంద్రానికి సంబంధించిన విద్యార్థులకు 5600 మందికి యూనిఫామ్, స్కూల్ బ్యాగులు, షూస్ మొదలగునైనట్టిని ప్రభుత్వం అందజేసింది. కార్యక్రమంలో రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



# హామీల అమలులో వైఫల్యం చెందిన టిడిపి

**ప్రొద్దుటూరు, జూన్ 3, ప్రభాతవార్త**
రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల పూర్తవుతున్న నేపథ్యంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి రావడానికి ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన టీడీపీ ప్రభుత్వం వాటి అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, పేదల సమస్యలు పరిష్కారం కాకపోగా, ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, ఎన్నికల హామీల అమలును డిమాండ్ చేస్తూ జూన్ 4, 8, 12 తేదీల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహించనున్నామని, జూన్ 12న భారీ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి ప్రజల అసంతృప్తిని తెలియజేస్తామని చెప్పారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టే కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని రాచమల్లు స్పష్టం చేశారు. అనంతరం వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమాలకు సంబంధించిన ప్రచార పత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుండి వరుసగా వైసీపీ నిరసనలు

## మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి

